

# శ్రీవారికి ప్రేమలేఖ

శివలెంక నాగ ఉదయలక్ష్మి

ఆఫీసు నుంచీ వచ్చిన శశాంక బూట్లు విడవకుండానే సోఫాలో అలసటగా కూర్చున్నాడు. సుధ పుట్టింటికి వెళ్లి రెండురోజులే అయింది. అప్పుడే ఎన్నో రోజులయినట్లుగా, అతనికి బోర్‌గా అనిపిస్తోంది. వాళ్ల చెల్లెలి పెళ్లి అని, అందరూ వస్తున్నారని, మనం కూడా వెళ్దామని ఎంతగానో బ్రతిమాలింది.

కానీ తనే వెళ్లలేకపోయాడు. ఆఫీసులో పని వత్తిడివలన, సెలవు దొరకకపోవడం వలన తను వెళ్లలేకపోయాడు. పాపం ఎంత బాధ పడిందో! అయినా తన మనసు నొప్పించకుండా మనసుకి సర్ది చెప్పుకుంది.

సుధ గుర్తుకు రాగానే ఒక్కసారిగా ప్రేమతో మనసు మూలిగింది. ఛ్! ఇంకా పదిరోజులు ఈ విరహవేదన తప్పదు అనుకుంటూ పేపర్‌లో తల దూర్చాడు శశాంక.

'మీకు లెటర్ వచ్చిందంటూ' పక్కింటి వాళ్ల పాప శ్వేత' ఓ బరువైన కవర్ చేతికిచ్చి పరుగెత్తుకుంటూ వెళ్లిపోయింది.

శశాంక వెంటనే కవర్ చించాడు. క్రింద సంతకం చూస్తే 'సుధ'. రెండ్రోజుల్లో లెటర్ ఎలా వచ్చిందబ్బా అనుకుంటూ కవర్‌పైన చూసాడు. కొరియర్‌లో ఆ లెటర్ పంపింది. క్షణంసేపు కళ్ళు విచిత్రంగా మెరిసాయి. తరువాత అక్షరాల వెంట పరుగులు తీసాయి.

"ప్రియాతి ప్రియమైన శశీ,

కళ్యాణి పెళ్లి కోసం వచ్చానేగానీ మనసంతా మీ దగ్గరే వుంది సుమా. ఎలా ఉన్నారో, ఏం తింటున్నారో! పోనీ సెలవు పెట్టి రండి అంటే మీరు ఉద్యోగం, బాధ్యతలు గురించి ఉపన్యాసం ఇచ్చారు. అన్నట్లు మేము క్షేమంగా చేరాము. మేము రైలు దిగగానే మా నాన్నగారు స్టేషన్‌కి రెండెడ్లబండి పంపారు. మన శిల్ప, చరణ్ ఎంత సంబరంగా, సంతోషంగా ఎంజాయ్ చేసారో తెలుసా? దారి పొడవునా పచ్చని చేలు చూస్తూ వాళ్ళు చేసిన అల్లరి... మీరు కూడా మా ప్రక్కన వుంటే ఎంత బాగుండేది. ఆ... మీకు గుర్తుందో లేదోగానీ మన పెళ్లయి మూడు నిద్రలకని మా వూరొస్తుంటే రైలు దిగగానే రెండెడ్ల బండి చూసి మీరు ముఖం చిట్లించుకోవడం, ఎలాగో మీకు నచ్చచెప్పి బండి ఎక్కడం, ఎడ్లబండి కుదుపులకి నేనొచ్చి మీ ఒళ్ళో వాలడం, అప్పుడు మీరెంత దగ్గరగా వచ్చారో నన్నందుకోవాలన్న ఆరాటంతో! పక్కనే మా అక్కా, బావలు నవ్వుకోవడం, దూరంగా జరిగానని మీ కళ్లల్లో చిరుకోపం, ఒక్కటేమిటి...! ఈ వూరు రాగానే మనం పంచుకున్న మరపురాని మధురానుభూతులు అన్నీ గుర్తుకొస్తున్నాయి.

ఆషాఢం వచ్చిందని మావాళ్ళు మన తొలిరేయికి ముహూర్తాలు లేవన్నప్పుడు మీరు కోపంగా చూడడం నాకిప్పటికీ నవ్వొస్తుంది.

ఎందుకో తెలుసా? ఆషాఢ మాసం మీ కోర్కెలకు సంకెళ్ళు వేసిందని. అటు ఆషాఢం వెళ్లగానే శ్రావణంలో నోములకని మావాళ్ళు ఆపేసారు. మీ ఉత్తరాల జోరు ఎక్కువైంది. ప్రేమ హోరులో మనం కాపురం పెట్టడానికి పెద్దవాళ్ళు ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? అని నేను ఎదురు చూస్తున్న తరుణంలో వరలక్ష్మి వ్రతం వచ్చింది. మీ అందరి రాకతో నా మనసు ఎంతో మురిసిపోయింది. వరలక్ష్మి వ్రతం అయ్యాక బామ్మ మీ ఆయనకి నమస్కారం చేయమన్నప్పుడు గదిలోకి వచ్చి అక్షింతలు వేయమని పాదాభివందనం చేయబోయాను.

'సుధా! ఈ వ్రతాలు అవి ఎందుకు చేస్తారు ఆడవాళ్ళు?' అని అడిగారు మీరు.

'సౌభాగ్యం కోసం' అన్నాను నేను.

'ఊహూ! భర్త సుఖంగా, ఆనందంగా ఉండాలి అంటే శృంగారవ్రతం కూడా ఏమయినా వుందేమో కనుక్కో మీ బామ్మని!'

మీ మాటల్లో వ్యంగ్యంకన్నా నన్ను మీలో ఎప్పుడు ఐక్యం చేసుకోవాలనే తపన కనబడింది ఆ క్షణంలో.

అప్పుడే అనుకున్నాను నిజంగానే శృంగార వ్రతం ఒకటి చేపట్టాలని. ఆ తరువాత అదే నిజమయింది. మన పెళ్లయి పది సంవత్సరాలు గడిచిపోయాయంటే నాకు నమ్మకం కలగడంలేదు. రోజులు ఎంత త్వరగా గడిచిపోయాయో కదూ! ప్రతి రాత్రి వసంత రాత్రిలాగా, ప్రతి రేయి పున్నమి రేయిలాగా మన ఆనందాలకు స్వాగతాలు పలుకుతూనే ఉన్నాయి. ఇక్కడికి వచ్చి 24 గంటలు కాకుండానే నా తనువు, మనసు మీ సమక్షంలో వాలిపోవాలని కోరుకుంది. నిన్న రాత్రి అందరం మేడమీద పడుకోవాలని పెళ్లి కూతురు సరదాపడింది. కళ్యాణి మాట కాదనలేక పైకి చేరాం అందరం.

తెల్లని వెన్నెల, కొబ్బరాకులలోంచి జాలువారిపోతోంది. పిల్లలు అల్లరి చేస్తున్నా, కొత్త పెళ్లికూతురితో మా వదినలు పరిహాసమాడుతున్నా నాకు మాత్రం మన పెళ్లయ్యాక మనం గడిపిన మధుర క్షణాలు గుర్తుకొస్తున్నాయి.

ఔను! ఆ రోజు మన తొలిరేయి గడిచాక మధ్యాహ్నం కాఫీ తీసుకుని మీ దగ్గరకు వచ్చాను. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ "సుధా! ఈ ఇరుకు



గదిలో గాలి, వెలుతురు లేవు. రాత్రికి మన పడక మేడమీదకి మార్చుకూడదూ?" అభ్యర్థనగా మీరు అడిగినప్పుడు నిజంగా గాలి, వెలుతురు లేవని బాధ పడుతున్నారని ఓకే అనేసాను.

రాత్రికిగానీ తెలియలేదు అయ్యగారికి గాలి, వెలుతురు కోసం కాదని!

మెల్లగా పాలగ్లాసు తీసుకుని మీ దగ్గరకు వచ్చాను నేను.

ఆ రోజు పౌర్ణమి. వెన్నెలతో పోటీ పడుతున్న మల్లెపూలను ఆఘ్రాణిస్తూ మీవైపుకి నన్ను తిప్పుకున్నారు. మేడమీద ఎవరో మనల్ని చూస్తున్నట్లు సిగ్గుగా అన్పించింది. అందుకే దోసిట్లో ముఖం దాచుకుని క్రిందకి వెళ్లిపోదాం అన్నాను.

ఊహూ! నామాట వినకుండా మీ చర్యకు అసంకల్పితంగా నా కనులు క్రిందకి వాలిపోయాయి.

పోనీ వాలిన కనురెప్పలనయినా వదిలేస్తారా అంటే... మీ అధరాలతో పెనవేసుకున్న ఆ కనులు తెలియని మైకంతో మరింత మూసుకుపోయాయి.

నన్ను నన్నుగా ఉండనీయని మీమీద చిరు అలుక. కానీ! నేను నేనుగా ఉండలేకపోతున్నాను కదా! అందుకే మరింత ముందుకు వంగాను.

మెడ వంపులో, నడుము ఒంపులలో అణువణువున గిలిగింతల సవ్వడికి, పులకింతల రవళి వినిపించింది కదా! ప్రకృతి పరవశిస్తూ మన రాసకేళిని ఆహ్వానించింది. జలపాతం ఉరకలు వేసి సాగరంలో కలసిపోయిన అనుభూతి.

ఎదలో ఉప్పొంగిన రసమయ భావాలన్నీ ప్రతిక్షణం మీకు ఆహ్వానాన్ని పలికాయి కదూ! మౌనంతో మన కళ్ళు మాట్లాడుకున్నాయి ఏవో గుసగుసలు. చంద్రుడిని సాగనంపి సూర్యుడిని పిలిచాం కదూ! ఆ రసానుభూతులే పదే పదే తలపుకొస్తున్నాయి.

రాజా! మా అక్కాచెల్లెళ్ళు అందరూ భర్తలతో వచ్చారు. మీరు రాలేదని నాకెంతగా బాధ వున్నా మీ ఉద్యోగ ధర్మానికి కట్టుబడి మిమ్మల్ని ఏ విషయంలోనూ బాధ పెట్టకూడదని నా ఉద్దేశ్యం.

అందుకే పెళ్లికి నేను పిల్లల్ని తీసుకుని వచ్చేసాను. మీ ఆరోగ్యం జాగ్రత్త. కళ్యాణి పెళ్లి కాగానే వెంటనే బయలుదేరుతాను. అసలు చెప్పాలంటే ఎంత త్వరగా మన వూరు వచ్చి మీ ఒడిలో వాలిపోవాలనుంది సుమా.

వచ్చే ముందు ఫోన్ చేస్తాను. మరి ఈ దేవిగారికి మల్లెలతో స్వాగతం పలుకుతారుకదూ. నా రాకకై ఎదురుచూసే, మీ కౌగిలిలో కరిగిపోవాలని...

సదా మీ
సుధ

గంటనుంచి ఓ పదిసార్లయినా ఆ ఉత్తరం చదివిన శశాంకకి... నిజంగా సుధ ఉత్తరం ఎంత బాగా వ్రాసింది అన్పించింది. సుధని ఎప్పుడు కలుసుకోవాలా అనే ఆరాటంగా అన్పిస్తోంది. తను సుధతో వెళ్లలేకపోయినందుకు చాలా బాధ కలిగింది. వెంటనే బాస్ ఇంటికి వెళ్లి వివరంగా చెప్పి, రిక్వెస్ట్ చేసి సెలవు చీటీ ఇచ్చి రాత్రికి ట్రైన్ ఎక్కేవరకూ శశాంక మతి స్థిమితపడలేదు.

***

పెళ్లి పందిట్లో పనులు పురమాయిస్తున్న సుధ, శశాంకని చూస్తూ ఆశ్చర్యంగా మొహం పెడుతూ "అదేమిటండీ మీరొస్తున్నట్లు తెలిస్తే నాన్నగారు ఏదైనా వెహికిల్ స్టేషన్‌కు పంపేవారుకదా!" నొచ్చుకుంటూ అంది.

"ఏమిటి ఎడ్లబండా? ప్రక్కన నువ్వుంటేగానీ దానిలో కూర్చోలేను నేను" కన్ను గీటుతూ లోపలకు వచ్చాడు శశాంక.

అమాయకంగా చూస్తున్న సుధలో ఇంత శృంగార లేఖని ఉందా? అనుకుంటూ-

"సుధా! నీ లెటర్ చూడగానే ఒక్కక్షణం కూడా నాకు ఒంటరిగా ఉండాలనిపించలేదు. నిజంగా నీ ఉత్తరం... నిన్నెప్పుడు చూస్తానా? అనిపించేటట్లు చేసింది తెలుసా?" అంటూ సుధని దగ్గరకు తీసుకోబోయాడు శశాంక.

"ఆ..ఆ...ఆగండి మహానుభావా! మా ఇంట్లో కళ్యాణి పెళ్లి తరువాత ఇంక ఏ శుభకార్యాలూ లేవు. మా అక్కలందరూ బావలతోసహా వచ్చారు. నేనొక్కదాన్నే ఇలా వచ్చాను.

నాకు చాలా బాధేసింది. మీరు ఒక్కసారి ఏదయినా నిర్ణయించుకుంటే మీ ప్రోగ్రాం మారదని తెలుసు. అందుకే అలా వ్రాసాను."

సుధ మాటలు పూర్తి కాకుండానే ఆమె పెదవులను తన పెదవులతో మూసేసాడు శశాంక.

"మన్నించు సుధా! ఇక ముందెప్పుడూ ఇలా చేయను. శృంగార మంత్రంతో భర్తను కొంగున కట్టుకున్నందుకు దేవిగారిని అభినందిస్తున్నాను" అన్నాడు శశాంక.

★

